ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

ప్రజవాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, డిసెంబర్ 30 : ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రమణ్యంతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించొద్దని , వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ప్రజావాణి ఫిర్యాదులతో పాటు సీఎం, జిల్లా మంత్రి ప్రజవాణి నుంచి వచ్చిన ఫిర్యాదులను సైతం వారంలో పరిష్కరించాలన్నారు. మొత్తం 37 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, తాసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

విరాళాలు సేకరించి ఇవ్వడం అభినందనీయం

వనపర్తి టౌన్, డిసెంబర్ 30 : విద్యార్థులు మానవతా దృక్పథంతో వరద బాధితులకు విరాళాలు సేకరించి ఇవ్వడం అభినందనీయమని కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రశంసించారు. వరద బాధితుల సహాయార్థం వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు సామాజిక బాధ్యతగా, స్వచ్ఛందంగా సేకరించిన విరాళాలు రూ.6.21లక్షల మొత్తాన్ని సీఎం సహాయనిధికి పంపించినట్లు తెలిపారు. ఈ వివరాలను సోమవారం కలెక్టర్ చేతులమీదుగా బహిర్గతం చేశారు. విరాళాలు సేకరించిన విద్యార్థులను సహకరించిన ప్రిన్సిపాల్లకు, ఈ కార్యక్రమాన్ని రూపొందించిన విద్యాధికారి ఎర్ర అంజయ్యను కలెక్టర్ అభినందించారు.

ఘనంగా వింటర్ ఫెస్ట్ వేడుకలు

నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

అలంపూర్, డిసెంబర్ 30 : పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో రెండు రోజుల కిందట వింటర్ ఫెస్ట్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గడిచిన సంవత్సరానికి బైబై, రాబోయో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలను పాఠశాల డైరెక్టర్ రవిప్రకాశ్, హెచ్ఎం నాగలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నైపుణ్యాలను పెంచే విధంగా అనేక వినోదాత్మక క్రీడలు నిర్వహించారు. ఇంగ్లిష్ నైట్ పేరుతో ఆటలు పాటలు, డ్యాన్స్, భాషనైపుణ్యం పెంచే విధంగా ఎన్నో కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రవిప్రకాశ్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అదుపులోనే నేరాలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, డిసెంబర్ 30 : ముందస్తు నియంత్రణ చర్యల్లో భాగంగా నేరాల సంఖ్య పెరిగినప్పటికీ అదుపులో ఉండడమే కాకుండా తగ్గుముఖం పట్టాయని ఎస్పీ రావుల గిరిధర్ చెప్పారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2024వార్షిక నివేదికను విడుదల చేశారు. గతేడాదితో పోలిస్తే అన్ని రకాల నేరాల్లో పెరుగుదల కనిపించిందని మహిళా నేరాలు 50శాతం పెరిగాయని, ఆర్థిక నేరాల శాతం తగ్గిన, రేప్ కేసులు 35శాతం పెరిగాయని , మర్డర్, ఇసుక అక్రమ రవాణా, దొంగతనాలు, హత్యయత్నం కేసులు, మహిళల వేధింపుల కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు , రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైం , మైనర్ బాలికల వివాహాల కేసులు పెరిగాయని, వాహన దొంగతనాల కేసులు, డ్రంకెన్ డ్రైవ్ కేసులు కొంతమేర తగ్గుముఖం పట్టాయని వెల్లడించారు. 2023 ఏడాదిలో 2,173 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 2538 కేసులు నమోదయ్యాయని, దొంగతనాలు 58 అదనంగా, డ్రంకెన్ డ్రైవ్ కేసులు 2,366 ఉండగా ఈ ఏడాది 2180 నమోదయ్యాయన్నారు. రోడ్డు ప్రమాదాలు 2023లో 258, ఈ ఏడాది 218 జరిగాయని తెలిపారు. గతేడాతో పోలిస్తే ఈ ఏడాది మిస్సింగ్ కేసులు 49పెరిగాయని, పోక్సో 8 కేసులు పెరిగాయని, మహిళల వేధింపుల కేసులు 259 గతేడాదితో పోలిస్తే అదనంగా వచ్చాయని చెప్పారు. కాగా మోటర్ వాహనాల కేసులు 8,180 ఉన్నాయన్నారు. ఈ ఏడాది నవంబర్ వరకు నివేదికను రూపొందించామని వెల్లడించారు. మహిళల నేరాలు 50 శాతం పెరిగాయని, ఆర్థిక నేరాల శాతం తగ్గిన మహిళలపై హత్యాచార కేసులు 35 శాతం పెరిగాయని చెప్పారు. పోలీసులను ఆశ్రయించిన ప్రతి ఒక్కరి ఫిర్యాదులను కేసులుగా నమోదు చేశామని, వారు లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా పరిష్కరించకుంటే వారి విజ్ఞతకే వదిలేశామని చెప్పారు.

పోలీస్ ప్రజావాణికి 15 ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 15 ఫిర్యాదులు అందాయని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించారు. అందులో 6 భూ ఫిర్యాదులు, 4 పరస్పర గొడవల పిర్యాదులు, 5 భార్యాభర్తల ఫిర్యాదులు అందాయని చెప్పారు.

సంతోషాల నడుమ వేడుకలు నిర్వహించుకోవాలి

సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. డిసెంబర్ 31న జిల్లావ్యాప్తంగా విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు ఉంటాయని వేడుకలకు డిజేలు, అధిక శబ్దం వచ్చే బాక్సులు విని యోగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలుగాలని ఆశిస్తూ పోలీసుల పక్షాన ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు, సీఐ రాంబాబు, శివకుమార్, ఎస్సై రవిప్రకాశ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

విత్తన డీలర్ల పరిజ్ఞానం రైతులకు ఉపయోగపడాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, డిసెంబర్ 30 : డిప్లొమా కోర్సుల్లో నేర్చుకున్న పరిజ్ఞానం రైతులకు ఉపయోగపడే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సంతోష్ డీలర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ 2022-2023 ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే డీలర్లకు వాటి అవసరం, వినియోగంపై శాస్త్రీయమైన అవగాహన కల్పించాలనే లక్ష్యంతో 48వారాల పాటు డిప్లొమా కోర్సును కేంద్రవ్యవసాయశాఖ ద్వారా అందించినట్లు తెలిపారు. విత్తనాల డీలర్లు రైతులతో మంచి సంబంధాలు ఏర్పర చుకొని వారికి కొత్త వ్యవసాయ పద్ధతులు, ఎరువు మందుల వాడకం, పంటలకు సంక్రమించే రోగాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు రసాయనిక ఎరువుల వాడకంపై స్పష్టంగా వివరించాలని చెప్పారు. డీలర్లు రైతులకు మంచి సలహాలు ఇస్తే రైతులు ఎక్కువ దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. రైతులకు అధిక దిగుబడి ఇచ్చే ఆయిల్ పాం సాగుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 38మంది డీలర్లకు సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఏవో సక్రియనాయక్, ఉద్యానవనశాఖ అధికారి అక్బర్ బాషా, వ్యవసాయశాఖ అధికారులు సంగీతలక్ష్మి, రమేశ్ బాబు,ఏవో జనార్దన్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణి దర ఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దర ఖాస్తులను త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేక పోతే తగిన సూచనలు ఇవ్వాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 65ఫిర్యాదులు అందాయని వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని లేక పోతే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు పొందిన డీలర్లతో కలెక్టర్

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు

- కాంగ్రెస్ నాయకులతో అధికారుల కుమ్మక్కు
- బస్తాకు 1.3 కేజీల వడ్లు అదనం
- ధాన్యం కొనుగోళ్ల సెంటర్లపై విచారణ చేయాలి
- బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు కుర్వ పల్లయ్య

ఉప్పల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్‌వీ జిల్లా నేత కుర్వ పల్లయ్య

అయిజ, డిసెంబర్ 30 : ధాన్యం కొనుగోళ్లలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా అవకతవకలకు పాల్పడుతూ, ఆరుగాలం కష్టపడి పండించిన రైతులను నట్టేట ముంచుతున్నారని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు కుర్వ పల్లయ్య ఆరోపించారు. అయిజ మండలంలోని ఉప్పల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. కేవలం గన్నీ బ్యాగు బస్తా బరువుకు తగ్గట్లు వడ్ల తూకం తీసుకోవాలని అదనంగా వడ్లను సేకరించరాదని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, సివిల్ సప్లై డీఎంలు ఆదేశించినా కిందిస్థాయి అధికారులు తుంగలో తొక్కి ధాన్యం సేకరణలో అక్రమాలకు పాల్పడుతున్నారని, బస్తాకు 1.3కేజీలను అదనంగా సేకరించి రైతులను మోసం చేస్తున్నారని పల్లయ్య పేర్కొన్నారు. బస్తా తూకం కేవలం 480గ్రాములు ఉండగా, 1.300 కేజీలు అదనంగా తీసు కోవడంలో ఐకేపీ సెంటర్ల అంతర్యమేమిటో తెలియడం లేదన్నారు. రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులను సకాలంలో ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అకాల వర్షాలు వచ్చి ధాన్యం తడిస్తే బాధ్యత ఎవరు వహిస్తారన్నారు. ఉప్పల ఐకేపీలో ఏఈవో కాంగ్రెస్ నాయకులకు వంత పాడుతూ తేమ శాతం ఎక్కువ ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. సామాన్య రైతుల ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలపై ఉన్న తాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు మత్తాలి, నాయకులు మాధవ్ పాల్గొన్నారు.

యువత నిబంధనలు పాటించాలి

- రాజోళి ఎస్సై జగదీశ్

మాట్లాడుతున్న ఎస్సై జగదీశ్

రాజోళి, డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనే యువత నిబంధనలు పాటించాలని ఎస్సై జగదీశ్ సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, బైక్‌లపై ప్రయాణిస్తూ ప్రజలను ఇబ్బందులు పెడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. అతివేగంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డుప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బైక్‌లపై యువత పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించడం, గుంపులుగా ఏర్పడి కేక్‌లు కట్‌చేస్తూ పటాకులు కాల్చడం చేయకూడదన్నారు. ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే 100 కు డయల్ చేయాలని ఎస్సై ప్రజలకు సూచించారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ఎస్పీ తోట శ్రీనివాస రావు

గద్వాల అర్బన్, డిసెంబర్ 30 : జిల్లాలోని ప్రజలు నూతన సంవత్సర వేడుకలను పోలీస్ అధికారుల సూచనల పాటిస్తూ ఇతరలకు ఇబ్బందులు కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్పీ తోట శ్రీనివాసరావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. నూతన ఇయర్ వేడుకలను పురస్కరించుకొని ట్రాఫిక్ , లా అండ్ ఆర్డర్‌లో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా అప్రమత్తమై పక్కా కార్యాచరణతో విధుల్లో ఉంటారన్నారు. ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎవరైనా అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఎక్కడా ప్రజలను భయాందోళనకు గుర్యయే విధంగా క్రాకర్స్, అత్యధిక సౌండ్‌తో డీజేలు ఏర్పాటు చేయడం నిషేధమని తెలిపారు.

మిస్సింగ్ మొబైల్‌ఫోన్స్ రికవరీ

ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబర్ 30 : మండలంలోని కోదండా పుల్ పీఎస్ పరిధిలో కొన్ని రోజులుగా మిస్సింగ్ అయిన మొబైల్‌ఫోన్లను ఐటీ కోర్‌టీం వారి సహకారంతో మూడు సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులు సోమవారం అప్పగించామని ఎస్సై స్వాతి తెలిపారు. అదేవిధంగా డంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన బోరవెల్లికి చెందిన మహేశ్‌ను మూడు రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరికి గాయాలు

అమరచింత, డిసెంబర్ 30: మండలంలోని మస్తీ పుల్ క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీ కొట్టు కోవడంతో ఒకరికి గాయాలు కాగా గమనించిన బాటసారులు 108కు సమాచారం అందించి ఆత్మకూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మండలంలోని చంద్రఘడ్ గ్రామానికి చెందిన నల్లా రెడ్డితన బైక్‌పై అమరచింత వస్తుండగా, అమరచింత నుంచి ఇద్దరు యువకులు బైక్‌పై ఆత్మకూర్‌కు వెళ్తుండగా మస్తీ పుల్ క్రాస్‌రోడ్డు వద్ద ఢీ కొట్టుకున్నాయి. ఈప్రమాదంలో నల్లారెడ్డికి గాయాలు కాగా ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా దవాఖానకు రెఫర్ చేశారు. ఈఘటనపై ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేసి విచారణ చేస్తామని ఎస్సై సురేశ్ తెలిపారు.

మిషన్ భగీరథ నీళ్లు రాక ఇక్కట్లు

- పీఎస్ దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్తులు

పంచాయతీ కార్యదర్శితో తాగునీటి సమస్య గురించి మాట్లాడుతున్న గ్రామస్తులు

గట్టు, డిసెంబర్ 30 : మండలంలోని బోయలగూడెంలో కొద్దిరోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా సమస్యను ప్రజలు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. పక్క గ్రామాలకు తాగునీరు అందుతున్నాయి. తమ తెదుకు నీటి సరఫరా కావడంలేదని పీఎస్‌ను ప్రశ్నించారు. గ్రిడ్ నుంచి గ్రామానికి నీటి సరఫరా సరిగ్గా జరుగడంలేదని, దీంతో నీటి సమస్య తలెత్తిందని పీఎస్ చెప్పారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వివాదం అక్కడికి సద్దు మణిగింది.

రాష్ట్రస్థాయి పోటీలకు సంకాపురం బాలికలు

అయిజ రూరల్, డిసెంబర్ 30 : మండలంలోని సంకాపురం గ్రామానికి చెందిన మల్లేశ్వరి, మనస్విత ఉత్తనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్నారు. ఇటీవల జరిగిన సీఎం కప్ రన్నింగ్ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అలాగే జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక యయ్యారు. దీంతో మంగళవారం జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. దీంతో ఇద్దరిని విద్యార్థినులను గ్రామస్తులు సోమవారం అభినందించారు.

ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోవాలి

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రజిని

వనపర్తి టౌన్, డిసెంబర్ 30 : న్యాయస్థానాల్లో లోక్ అదాలత్ సంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ కార్యదర్శి రజిని అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రంలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చట్టం దృష్టిలో ప్రజలందరూ సమానులేనని అందరికీ న్యాయ సేవలు అందాలన్న లక్ష్యంతో న్యాయ స్థానాల్లో లోక్ అదాలత్ సంస్థలు రూపుదిద్దుకున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలు, మైనర్ పిల్లలు రూ.3లక్షల ఆదాయం ఉన్నవారికి వృద్ధులు, ప్రకృతి వైపరీత్యాల బాధితులకు లోక్ అదాలత్ ద్వారా న్యాయ స్థానాల్లో ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నారన్నారు. ఉచిత న్యాయ సేవలకు న్యాయ వ్యవస్థలో 1510 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారని, సఖి కేంద్రంలో అమలవుతున్న సేవలను మహిళలు వినియోగించుకోవాలని కేంద్రం కార్య నిర్వాహకురాలు కవిత అన్నారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ డిఫెన్స్ అసిస్టెంట్ కౌన్సిల్ శ్రీదేవి, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు కృష్ణయ్య, లోక్ అదాలత్ సిబ్బంది , సఖి కేంద్రం సిబ్బంది ఉన్నారు.

డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరాటం

సమ్మెలో పాల్గొన్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

గద్వాలటౌన్, డిసెంబర్ 30 : తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని జేఏసీ నాయకులు ఉసేనప్ప, గోపాలు అన్నారు. జిల్లా కేంద్రంలోని స్మృతి వనం ఎదుట చేపట్టిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమ్మె చేపట్టిన ఇరవై రోజులైనా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీఆర్‌టీయూ, బహుజన సమాజ్ పార్టీలు సమ్మెకు మద్దతును తెలిపాయి. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారులు, సీఆర్‌టీలు, పీజీసీఆర్టీలు, నాన్‌టీచింగ్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ పనులకు నిధులు మంజూరీపై హర్షం

జిల్లా ఘనపురం, డిసెంబర్ 30 : మండలంలోని కర్నెతండా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు సంబంధించిన సబ్ స్టేషన్ పనులకు బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో జీవో నెంబర్ 345 ద్వారా రూ.1కోటి 64లక్షల నిధులను మంజూరు చేసింది. అయితే సోమవారం ఈ నిధులు విడుదల కావడంతో నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నిధులు విడుదలకు కృషిచేసిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కర్నెతండా లిఫ్ట్ పనులు పూర్తయితే మామిడిమాడ, లట్టుపల్లి, షాపూర్ గ్రామాలతో పాటు 10 గిరిజన తండాల్లోని 5వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, గత కొంతకాలంగా ఎలక్ట్రికల్ పనులు నిలిచి పోయిన కారణంగా పంపుల పని ఆగిపోయిందని ఈ విషయాన్ని చిన్నారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ప్రభుత్వంతో చర్చించి నిధులను విడుదల చేశారని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్ అన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో నాయకులు పీనానాయక్, మన్యం గౌడ్, మాజీ సర్పంచులు , తండావాసులు ఉన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

రాజోళి, డిసెంబర్ 30 : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిస్తూ బాలల చట్టాలపై గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు యువత ముందుకు రావాలని మాన్‌దొడ్డి పంచాయతీ కార్యదర్శి వీరేశ్ అన్నారు. సోమవారం మానవహక్కులపై సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో రెవెన్యూ, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

శ్రమజీవుల దోపిడీకి వ్యతిరేకంగా సీపీఐ వందేళ్ల పోరాటం

వనపర్తి టౌన్, డిసెంబర్ 30 : దేశంలో శ్రమజీవుల దోపిడీకి వ్యతిరేకంగా వందేళ్లుగా పోరాడుతూ వస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. సోమవారం సీపీఐ పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నల్లగొండలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జెండా ఊపి పార్టీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజ స్థాపన, కోసం పీపీఐ 1925 డిసెంబర్ 26న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కాన్పూరులో పురుడు పోసుకొని నేటికి వందేళ్లు పూర్తి చేసుకుందన్నారు. తరలివెళ్లిన వారిలో జిల్లా నేతలు కళావతమ్మ, రమేశ్, గోపాలకృష్ణ, శ్రీహరి, రాబర్ట్, మోషే, సీఎన్ శెట్టి, శివ, చంద్రయ్య, కృష్ణవేణి, గీత, భాస్కర్, మహేశ్, బాలరాజు, చిన్న కుర్మన్న ఉన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

అమరచింత, డిసెంబర్ 30 : అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గంనుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీల నాయకులు గోపి, వెంకటేశ్, ఆజయ్, అబ్రహం, భాస్కర్, రాజన్న, కుర్మన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వ్యవసాయ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం అమిత్‌షాను మంత్రి వర్గంనుంచి తొలగించి తన చిత్త శుద్ధిని చాటుకోవాలని, లేక పోతే వ్యవసాయ పార్టీల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రెండు గ్లాసుల పద్ధతి పాటించొద్దు

మల్దకల్, డిసెంబర్ 30 : మండలంలోని అన్ని గ్రామాల్లోని హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతిని అవలభించ కూడదని ఆర్ఐ నాగిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని నేతువానిపల్లి గ్రామంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్ఐ నాగిరెడ్డి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ అన్నదమ్ములా కలిసి మెలసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

గట్టు, డిసెంబర్ 30 : మండలంలోని చాగదోణిలో పౌరహక్కుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాజు, కృష్ణ, ఏఎస్సై అయ్యన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామంలో సమాజంలో అందరూ సమానులేనన్నారు. ఎక్కడా అంటరానితనం, రెండు గ్లాసుల విధానానికి దూరం ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో స్థానికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ వర్గీకరణపై వినతుల స్వీకరణ

జెడ్పి సెంటర్, డిసెంబర్ 30 : జిల్లాలోని ఎస్సీ